ఆశలు చిగురించే..

- మామిడి చెట్లకు ముందస్తు పూత
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

కరప: ఈ ఏడాది ముందుగానే ఆశలు చిగురించాయి.. మామిడి రైతుల మోములో ఆనందం వెల్లివిరిసింది.. కరప మండలంలో మామిడి చెట్లు పూతతో కళకళలాడుతున్నాయి. గతేడాది మామిడి ధర బాగున్నా, దిగుబడులు లేక అనేక మంది రైతులు నష్టాలు చవిచూశారు. ఈ ఏడాది ఆ నష్టాలను భర్తీ చేసుకునేందుకు మామిడి తోటలను అధిక రేట్లకు కొనుగోలు చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధి కరప మండలంలో 190 ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు ఉన్నాయి. మండలంలోని కరప, అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కోరుపల్లి, గొర్రిపూడి, గురజనాపల్లి, కూరాడ, వలసపాకల, పెద్దాపురప్పాడు తదితర గ్రామాలతో పాటు పొలం, కాలువ గట్లపై మామిడి చెట్లు ఉన్నాయి. ఈ ఏడాది బాగా కాస్తాయనే ఉద్దేశంతో మామిడి తోటలు కొన్నట్టు కరప గ్రామానికి చెందిన నల్లా అన్నారం, పి.సత్తిబాబు, శివ తదితరులు తెలిపారు. ఇప్పటికే చాలా ఖర్చు చేసి మూడు సార్లు పురుగు మందులు పిచికారీ చేసినట్టు వివరించారు. గత ఏడాదితో పోలిస్తే కొన్ని ప్రాంతాల్లో పూత ముందుగానే వచ్చినా, కొన్ని ప్రాంతాల్లో ఆలస్యంగా వస్తున్నట్టు చెబుతున్నారు. తేనె మంచు కురవకుండా వాతావరణం అనుకూలిస్తే మామిడి దిగుబడులు బాగుంటాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మామిడి కాయలు పెరిగే సమయంలో వేసవిలో గాలి గొమ్ములు వంటి ప్రతికూల వాతావరణం లేకపోతే దిగుబడులు బాగుంటాయి.


పేపకాయలపాలెంలో రోడ్డు పక్కన కాలువ గట్టుపై పూతతో మామిడి చెట్లు

తెగుళ్లు.. నివారణ చర్యలు

జనవరిలో తేనె మంచు పురుగు ఆశిస్తుంది. పూత కొమ్మలోని లేత ఆకుల నుంచి రసం పీల్చడం వల్ల పిందెలు రాలిపోతుంటాయి. నల్లని తేనె వంటి పదార్థాన్ని విసర్జించడం వల్ల నల్లమచ్చ తెగులు వస్తుంది. నివారణకు ఎసిఫేట్ పౌడర్ ఒక గ్రాము మందు లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. బూడిద తెగులుతో తెలుపు రంగు పౌడర్ లాంటి పదార్థం పూత కొమ్మలు, పిందెలు, లేత ఆకులపై ఏర్పడుతుంది. దీని నివారణకు వెట్టబుల్ సల్ఫర్ గ్రాము మందు ఒక లీటరుకు కలిపి పిచికారీ చేయాలి. చల్లని చలి వాతావరణంలో పక్షికన్ను తెగులు ఆశిస్తుంది. నివారణకు సాఫ్ మందు (కార్బండిజమ్, మెన్‌కోజెట్) ఒక గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తగిన జాగ్రత్తలు అవసరం



మామిడి రైతులు అప్రమత్తంగా ఉంటూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటే మామిడిలో దిగుబడులు దక్కించుకోవచ్చు. మామిడి పూత దశలో తేనె మంచు వల్ల నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుత వాతావరణం మామిడి పూతకు అనుకూలంగా ఉంది. పూత రాలేదని చాలామంది రసాయనికి మందులు పిచికారీ చేస్తుంటారు. దానివల్ల ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువ.

–ఏవీ రాజేష్, కరప మండల వ్యవసాయాధికారి

పెట్టుబడులు పెరిగాయి



రైతులు మామిడి తోటల ధరలు పెంచేస్తున్నారు. పిందె దశ వచ్చే వరకు మూడు, నాలుగు సార్లు మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. పశువులు రాకుండా తోటల చుట్టూ కంచె వేయడానికి ఖర్చులు పెరిగిపోయాయి. తేనె మంచు, గాలిగొమ్ములు వంటి ప్రతికూల వాతావరణం ఉంటే లాభాల మాట ఎలా ఉన్నా పెట్టుబడులు కూడా దక్కవు.

–నల్లా అన్నవరం, మామిడి రైతు, కరప

ముంచిన అకాల వర్షం

కరప: మండలంలో గురువారం తెల్లవారుజాము **నుంచి ఉదయం 10** గంటల వరకూ కురిసిన **అకాల వర్షానికి తోడు** పైప్రాంతాల నుంచి ముంపు **నీరు వచ్చి చేరుతుండ**టంతో పల్లపు ప్రాంతాలు, **వర్ర భూముల్లో వెదజ**ల్లిన పొలాలు ముంపునకు **గురయ్యాయి. ప్రస్తుతం** రబీ సాగు పనులు ముమ్మ**రంగా జరుగుతున్నాయి**. అకాల వర్షంతో సాగుకు **ఆటంకం ఎదురైందని** రైతులు అంటున్నారు. తెల్ల**వారుజాము నుంచి వర్ష**ం పడటంతో కరప, వలసపాకల, వాకాడ, వేములవాడ, పెదకొత్తూరు, కూరాడ, పాతర్లగడ్డ తదితర గ్రామాల్లో శివారు ప్రాంత, వర్ర భూములు ముంపునకు గురయ్యాయి. మంగళ, బుధవారాల్లో వెదజల్లిన పొలాల్లో నీరు నిలిచిపోయింది. దీనివల్ల మొలక శాతం దెబ్బతింటుందని, అలాంటి చోట్ల తిరిగి నాట్లు వేయాల్సి ఉంటుందని రైతులు నక్కా భద్రం, వెలుగుబంట్ల రవినాయుడు, పెంకే అప్పన్న తెలిపారు. మళ్లీ వర్షం వస్తే, విత్తనాలు చల్లుకోవాల్సి వస్తుందన్నారు. వెదజల్లిన పొలాల్లో మళ్లీ విత్తనాలు చల్లుకోవాల్సి వస్తుందని తెలిపారు. మెరక ప్రాంత భూములకు, కాలువ శివారు భూములకు వర్షాలు ఉపయోగపడ్డాయని అంటున్నారు.


వేములవాడలో ముంపునకు గురైన పొలం

అలరించిన నృత్య ప్రదర్శన


నృత్యం చేస్తున్న మంజీర నాట్యాలయ విద్యార్థులు

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియలో సంస్థ 52వ వార్షికోత్సవ వేడుకలు, ధనుర్మాస ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసుడు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. మంజీర నాట్యాలయ నాట్యాచార్యులు, విద్యార్థులు నృత్య రూపకాలను ప్రదర్శించారు. అనంతరం గాయత్రి గానలహరి బృందం సభ్యులు భక్తిగీతాలు ఆలపించారు. తదుపరి నాట్యాచార్యులు పి.దుర్గారావును సత్కళావాహిని సభ్యులు సత్కరించారు. నాట్య ప్రదర్శనలో పాల్గొన్న 16 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. దాతల సహకారంతో వేడుకలు నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు, తులసమ్మ, రామకృష్ణ, శారదాదేవి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దంత సమస్యలను అశ్రద్ధ చేయవద్దు

కాకినాడ రూరల్: మోనోపాజ్ దశలో మహిళలకు దంత చిగుళ్ల సమస్యలు వస్తాయని, దీనిని అశ్రద్ధ చేయవద్దని డాక్టర్ సువర్ణరాజు తెలిపారు. సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గురువారం వృద్ధులకు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. చిగుళ్ల వ్యాధి నుంచి ఏ విధంగా రక్షించుకోవాలో తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకు రోజూ రెండు సార్లు ఫ్లోరైడ్ టూత్ పేస్ట్‌తో బ్రష్ చేయాలని, ఏ ఆహారం తిన్నా నీటితో పుక్కిలించాలని సువర్ణరాజు తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

గురు గోవింద్ సింగ్‌కు నివాళి

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో గురు గోవింద్ సింగ్ జయంతిని గురువారం నిర్వహించారు. గోవింద్ సింగ్ చిత్రపటానికి అడబాల రత్నప్రసాద్, ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్, రెడ్నం రాజా తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ సిక్కు మత 10వ గురువైన గురు గోవింద్ సింగ్ సామాజిక వివక్ష అణచివేతకు వ్యతిరేకంగా పోరాడారన్నారు.

రోటరీ సెంట్రల్ క్లబ్‌కు రూ. 25 లక్షల విరాళం


రోటరీ సెంట్రల్ క్లబ్ సభ్యులకు విరాళం అందిస్తున్న శివరావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): రోటరీ క్లబ్ కాకినాడ సెంట్రల్ చేపట్టే శాశ్వత ప్రాజెక్టుల కోసం నగరానికి చెందిన గాది శివరావు ఆయన భార్య సీతామహాలక్ష్మి జ్ఞాపకార్థం రూ. 25 లక్షల చెక్కును గురువారం క్లబ్ సభ్యులకు అందించారు. క్లబ్ శాశ్వత ప్రాజెక్టులైన బ్లడ్ బ్యాంకు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఫిజియోథెరపీ సెంటర్ల నిర్మాణం కోసం ఈ విరాళం అందించారు. శివరావును క్లబ్ అధ్యక్షుడు సామా భాస్కర్, ప్రాజెక్టు చైర్మన్ బోడా ఆనంద్‌కుమార్, క్లబ్ ఫౌండర్ మెంబర్ వాకచర్ల సూర్యం ఆధ్వర్యంలో సత్కరించారు.

లక్ష్య స్కూల్‌కు అవార్డు

బాలాజీచెరువు: లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌కు బ్రెయిన్‌ఫీడ్ టాప్ 500 స్కూల్ ఆఫ్ ఇండియా నిర్వహించిన కార్యక్రమంలో బ్రెయిన్ స్కూల్ ఎక్స్‌లెన్స్ అవార్డు 2022–23కు అందజేశారు. గురువారం ఈ విషయాన్ని పాఠశాల డైరెక్టర్ ఎస్.సుగుణారెడ్డి తెలిపారు. పాఠశాలలో విద్యతో పాటు ప్రతిభను వెలికితీసే శిక్షణ ఇవ్వడం వంటి అంశాలు పరిగణనలోకి తీసుకుని అవార్డు ఇచ్చారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యాశంకర్, వైస్ ప్రిన్సిపాల్ హేమలతలను అభినందించారు.

రాజ్యాంగ హక్కులు కాపాడుకుందాం..

కాకినాడ సిటీ: రాష్ట్రంలో నిర్బంధ పరిపాలన కొనసాగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. గురువారం స్థానిక సాంబమూర్తినగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు చేసే హక్కు ఉందని, రాజ్యాంగ హక్కులను కాపాడుకునేందుకు ఉద్యమిస్తామన్నారు. టిడ్కో గృహాలు శిథిలస్థితికి చేరకముందే ప్రజలకు అందించాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోకల ప్రసాద్, జి.లోవరత్నం, జిల్లా కార్యవర్గ సభ్యుడు పెద్దిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

బాలుడి ఆచూకీ లభ్యం

కాకినాడ క్రైం: మానసిక స్థితి సరిగా లేని మూగ బాలుడు తప్పిపోవడంతో పోలీసులు అతని ఆచూకీ గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. కాకినాడ సాంబమూర్తినగర్‌కు చెందిన 10 ఏళ్ల బాలుడు మానసిక పరిపక్వత లోపించి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి తప్పిపోయాడు. తల్లిదండ్రులు కాకినాడ త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించగా ప్రత్యేక బృందాలు గాలించి కోకిల సెంటర్ వద్ద బాలుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కరప: కరపలో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పరామర్శించారు. నక్కా భాస్కరమ్మ మరణించగా కుమారులు వెంకటరమణారావు, బాలనగేష్‌లను, చౌదాళ్ల వీరవెంకట రాఘవమ్మ మరణించగా కుమారులు పెద్దకాపు, వెంకటేశ్వరరావు, కుమార్, కృష్ణలను, పోలిశెట్టి సత్యవతి మరణించగా వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కన్నబాబు పరామర్శించారు. జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి ఉన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగే సమావేశంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పాల్గొంటారని ఇన్‌చార్జి ఎంపీడీఓ గుత్తుల భీమశంకరరావు తెలిపారు. మండలంలో కొత్తగా మంజూరైన 357 మందికి పింఛన్ల సొమ్ము అందజేసి ఎమ్మెల్యే మాట్లాడతారని తెలిపారు. లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ముగిసిన సప్త సప్తాహ మహోత్సవాలు

కరప: కొంగోడులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో గురువారం స్వామివారికి శాంతి కల్యాణంతో సప్త సప్తాహ మహోత్సవాలు ముగిశాయి. ఆలయ ప్రాంగణంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా 49 రోజుల పాటు రేయింబవళ్లు వివిధ భజన బృందాలతో సప్త సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి రామానుజాచార్యులు ఆధ్వర్యాన వేద పండితులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. తర్వాత గోపూజ, శాంతిహోమం, శాంతి కల్యాణం చేసి అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు, సర్పంచ్ నక్కా బాబులు, మాజీ సర్పంచులు మేడిశెట్టి సుబ్బరాజు, వింత అప్పారావు, వనుం గంగరాజు తదితరులు పాల్గొన్నారు.


కొంగోడులో శాంతి హోమం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

సేవే లక్ష్యంగా ముందుకు..

బాలాజీచెరువు: సేవ చేయడమే రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్ట్ (1978) లక్ష్యమని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక దేవాలయం వీధిలోని ట్రస్ట్ కార్యాలయంలో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సర విద్యార్థి ఎం.అకాష్‌కు రూ.లక్ష, డిగ్రీ ప్రథమ సంవత్సర విద్యార్థి ఎస్.ఆదిత్యరామ్‌కు రూ.15 వేలు అందజేశారు. అలాగే స్వయం ఉపాధిలో భాగంగా హోటల్ నిర్వహణ నిమిత్తం ఎం.పార్వతికి వంట సామగ్రి, గ్యాస్ స్టౌ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులంతా కలసి ప్రతి నెలా సేవా కార్యక్రమాలు ట్రస్ట్ ద్వారా చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి ఎస్.రామ్మూర్తి, ట్రస్ట్ అధ్యక్షుడు సీమకుర్తి పాపారావు, కార్యదర్శి జగన్నాథరావు, కోశాధికారి కళ్యాణి, నాగవేణి, సురేష్, ఆర్‌వీ రమణ పాల్గొన్నారు.


సాయం అందిస్తున్న ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు బాలకృష్ణ, సభ్యులు

నగరంలో జైనుల ర్యాలీ

కాకినాడ సిటీ: జైనుల పుణ్యక్షేత్రం జార్ఖండ్ రాష్ట్రంలోని సమ్మెత్ శిఖర్‌జీ ప్రాంతాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా ప్రకటించడాన్ని నిరసిస్తూ గురువారం కాకినాడలో జైన్ దేవాలయం నుంచి కలెక్టరేట్ వరకూ జైనులు ర్యాలీ నిర్వహించారు. దీనికి నాయకత్వం వహించిన వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ కార్యదర్శి నిర్మల్ జైన్ మాట్లాడుతూ జార్ఖండ్ రాష్ట్రంలోని సమ్మెత్ శిఖర్‌జీ పర్వత శ్రేణుల్లో 20 తీర్థంకరులు సాధన చేశారన్నారు. ఈ పర్వత శిఖరాల్లో అణువణువు జైనులకు పవిత్రమైందన్నారు. దైవ దర్శనానికి ఆ పర్వతాలపై ఎక్కేటప్పుడు జైనులు కాళ్లకు చెప్పులు కూడా వేసుకోరన్నారు. ఈ శిఖరాలకు అంతటి పవిత్రత ఉందని నిర్మల్ జైన్ అన్నారు. కానీ జార్ఖండ్ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా ప్రకటించిందన్నారు. ఇక్కడ మాంసం, మద్యం, జూదం, ఇతరత్రా అసాంఘిక కార్యకలాపాలు, స్టార్ హోటళ్ల వంటి నిర్మాణం వల్ల ఆ పవిత్రతకు ముప్పు వస్తుందని అన్నారు. నగర రాజాజీవీధి జైన్ ఆరాధన భవనం, దేవాలయం వీధి, బాలాజీ చెరువు మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకూ ప్రదర్శన చేసి కలెక్టర్ కృతికా శుక్లాకు వినతి పత్రం అందించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ కార్పొరేటర్ రాగిరెడ్డి అరుణ్‌కుమార్, కాకినాడ జైన్ సమాజ్ ప్రతినిధులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జైన్ సమాజ్ ప్రతినిధులు నిర్మల్ జైన్ తదితరులు


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న జైనులు

పోర్టులో పీఆర్వో, ఏపీఆర్వోలను తొలగించండి

కాకినాడ సిటీ: కాకినాడ పోర్టులో అవినీతిలో కూరుకుపోయిన ఏపీఆర్వో, పీఆర్వోలను విధుల నుంచి తొలగించాలని కోరుతూ కలెక్టర్, జిల్లా ఎస్పీలను కలసి ఫిర్యాదు చేసినట్లు తెలుగు జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పీఆర్వో, ఏపీఆర్వో పోస్టుల కేటాయింపులో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేసి వారిని తొలగించాలని గత ఏడాది డిసెంబర్ 29న కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వివిధ కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న ఈ వ్యక్తులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలన్నారు.

స్కౌట్స్‌తో క్రమశిక్షణ


వీసీ ప్రసాదరాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న హరివిఠల్, చంద్రమౌళి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక జేఎన్‌టీయూ వీసీ ప్రసాదరాజును హిందుస్థాన్ స్కౌట్స్ గైడ్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రాజగిరి హరివిఠల్, కార్యదర్శి బీఎస్ చంద్రమౌళి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. వర్సిటీలలో స్కౌట్స్ గైడ్స్ అమలు చేయాలని వారు వీసీని కోరారు. దీంతో ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైపుణ్యం, శారీరక దృఢత్వం అలవడతాయన్నారు. హరివిఠల్ మాట్లాడుతూ ప్రభుత్వం అనుమతితో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కళాశాలలు, పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారం అందిస్తున్నారన్నారు. రాష్ట్ర కార్యాలయం వైజాగ్‌లో ప్రారంభించామన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారు సత్య సూర్యరామలక్ష్మి

కాకినాడ రూరల్: దేవుడిలా పేదలను ఆదుకుంటున్న సీఎం జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వాకలపూడికి చెందిన నాయని సత్య సూర్యరామలక్ష్మి అన్నారు. కాకినాడ రూరల్ రమణయ్యపేట స్పందన ఫంక్షన్ హాలులో గురువారం ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ వంగా గీత, నియోజకవర్గ పరిశీలకుడు దున్నా జనార్దనరావు, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి తదితరులు కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తొలుత లబ్ధిదారు రామలక్ష్మి తన మనోగతాన్ని పంచుకున్నారు. తన భర్త చనిపోవడంతో ఇటీవల గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబును కలసి పింఛన్ ఇప్పించాలని కోరానని అన్నారు. నెల వ్యవధిలోనే పింఛన్ మంజూరు చేయించి దేవుడిలా ఆదుకున్నారని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. అనేక పథకాలతో పేదలను ఆదుకుంటున్న ఈ ప్రభుత్వమే తిరిగి రావాలని ఆమె కోరుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలంతా ఆనందంగా జీవిస్తున్నారని అన్నారు.

నేడు అష్టోత్తర శత ద్రవ్యాభిషేకం


పూజకు 108 కలశాలు సిద్ధం చేస్తున్న సిబ్బంది

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపురసుందరీ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు అష్టోత్తర శత ద్రవ్యాభిషేకాలు జరుగనున్నాయి. ఈ పూజలు టీటీడీ వేద పండితుడు హోతా శివభాస్కరశర్మ ఆధ్వర్యంలో జరుగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారథి గురువారం తెలిపారు. ఉదయం 8.15 చతుర్వేద పండితుల ఆధ్వర్యంలో శత ద్రవ్యాభిషేకం, పుణ్యాహవచనం, గోపూజ, మహాన్యాసం, మండపారాధన, కలశస్థాపన, 108 ద్రవ్యాల సంప్రోక్షణ, మధ్యాహ్నం మూడు గంటలకు 108 కలశాలతో కాకినాడ పురవీధుల్లో ఊరేగింపుగా బయలుదేరి జగన్నాథపురం విఘ్నేశ్వర ఘాట్ వద్దకు చేరుకొని కలశాలలోని నీటిని గంగలో కలుపుతామన్నారు. లోక కల్యాణార్థం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

కరపలో టీడీపీ ప్రచారం

కరప: స్థానిక శివారు రామకంచిరాజునగర్ కాలనీలో గురువారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి, ఇంటింటికీ మీ అనంతలక్ష్మి కార్యక్రమాన్ని నిర్వహించారు. కుప్పంలో మాజీ సీఎం చంద్రబాబు పర్యటనను పోలీసులు అడ్డుకున్నారంటూ మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పిల్లి సత్యనారాయణ మూర్తి, బుంగా సింహాద్రి, కాకర్ల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తుల తయారీతో ఉపాధి

కాకినాడ రూరల్: ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం (పీఎం– ఎఫ్‌ఎంఈ) కింద ఆహార ఉత్పత్తి తయారీ పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి పొందవచ్చని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ కె.శ్రీరమణి పేర్కొన్నారు. రమణయ్యపేటలోని రూరల్ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో పీఎం– ఎఫ్‌ఎంఈ పథకంపై లబ్ధిదారులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. విజయవాడ నుంచి వచ్చిన సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ సరళ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 10 శాతం పెట్టుబడి, 90 శాతం బ్యాంకు ద్వారా రుణ సదుపాయం పొందవచ్చన్నారు. రుణంలో 35 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి హాజరైన పండూరు గ్రామానికి చెందిన మహిళలకు వ్యాపార నైపుణ్యాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ లైసెన్స్, ప్యాకేజింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ వంటి సదుపాయాలపై ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ట్రైనర్ తాడిమళ్ల చరణ్ సంజీవ్ అవగాహన కల్పించారు. డీపీఎం కేశవ్, ఏపీఎం వేదకుమారి, సీసీలు శ్రీధర్, సురేష్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతి పథం పీడీ శ్రీరమణ, సరళ

బలవంతపు వసూళ్లు మానుకోవాలి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని చేంజెస్ వలంటీర్స్ ఆర్గనైజేషన్ ప్రాంగణంలో హిజ్రాలకు గురువారం పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. సర్పవరం సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొంత మంది హిజ్రాలు రహదారులపై వెళ్లే వాహనదారులను ఆపి వారి నుంచి బలవంతంగా వసూళ్లకు పాల్పడం, అసాంఘిక కార్యకలాపాలు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఇటువంటివి మానుకోకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రుణాల ద్వారా సొంతంగా ఉపాధి పొందాలన్నారు. ట్రాన్స్‌జెండర్ పండమ్మ మాట్లాడుతూ తమకు ఆధార్ కార్డులు ఇవ్వాలని, జీవనోపాధి కల్పించాలని, ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. చేంజెస్ సంస్థ డైరెక్టర్ సుధారాణి, ప్రాజెక్టు మేనేజర్ దుర్గాభవాని మాట్లాడారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

కాకినాడ క్రైం: తమపై ఇద్దరు దాడికి పాల్పడ్డారంటూ పారిశుద్ధ్య కార్మికులు పోలీసులను ఆశ్రయించారు. స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికులుగా గొర్ల వీరబాబు, బవిరిశెట్టి గోవిందు పనిచేస్తున్నారు. గురువారం పర్లోవపేటలో విధులు నిర్వర్తిస్తుండగా డ్రైనేజీలోని మురుగును తీసి తమ ఇంటి ముందు వేశారంటూ మహిళలు దండు హేమలత, దండు జయ వాగ్వాదానికి దిగి, ఇంట్లో ఉన్న సామాన్లతో దాడి చేశారని గోవిందు, వీరబాబు పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సీతారామస్వామికి పూజలు

బోట్‌క్లబ్: ధనుర్మాస వ్రత మహోత్సవాలు, రజిత దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి గురువారం లక్ష్మీ హయగ్రీవ అలంకరణలో దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

హరీష్‌కు అభినందన


సమావేశంలో మాట్లాడుతున్న గోల్డ్ మెడల్ సాధించిన హరీష్ తదితరులు

కాకినాడ కల్చరల్: పరివర్తన వీధిబాలల సంరక్షణ కేంద్రంలో ఉంటున్న కరునూరి హరీష్ ఎంఏ మ్యూజిక్ హిందుస్థానీలో గోల్డ్ మెడల్ పొందడం అభినందనీయమని సూర్యకళా మందిర్ అధ్యక్షుడు కేవీఎస్ ఆంజనేయమూర్తి అన్నారు. స్థానిక సూర్యకళా మందిర్‌లో గురువారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హరీష్‌ను సభ్యులు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను చిన్నతనంలో రాజమహేంద్రవరం పుష్కరాలలో తప్పిపోవడంతో పరివర్తన అక్కున చేర్చుకుని చదువు చెప్పించిందన్నారు. తనలో ప్రతిభను గుర్తించిన అప్పటి సూర్యకళా మందిర్ ఉపాధ్యక్షురాలు దివంగత ఎల్.శేషుకుమారి ఉత్తరప్రదేశ్‌లోని బత్‌కండే సంస్కృత విశ్వవిద్యాలయంలో ఎంఏ హిందుస్థానీ మ్యూజిక్‌లో చేర్పించారన్నారు. ఫైనల్ ఇయర్ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి గోల్డ్ మెడల్ సాధించానని తెలిపారు. కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ ఎల్.సత్యనారాయణ్ (టిక్కు), కొమ్మురెడ్డి నానాజీ పాల్గొన్నారు.